# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.07.08.2018.**

## <u>మహారాష్ట్రకు చెందిన ఇద్దరు గంజాయి స్మగ్లర్‌లను అరెస్ట్ చేసిన పటమట పోలీసులు</u>

## *సుమారు రూ.3.50 లక్షల విలువైన 157 కిలోల గంజాయి స్వాధీనం*

గంజాయి అక్రమ రవాణాపై విజయవాడ పోలీస్ కమీషనర్ గారి ఆదేశాలపై కమీషనరేట్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాలు, రవాణాకు ఆస్కారం ఉన్న రహదారుల్లో విజయవాడ పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని వివిధ ప్రాంతాలకు నగరం మీదుగా రవాణా చేస్తున్న గంజాయిని భారీ మొత్తంలో పట్టుకుని, నిందితులను అదుపులోకి తీసుకోవడం జరుగుతోంది. గంజాయి అక్రమ రవాణాను కట్టడి చేసే క్రమంలో తొలుత గంజాయి రవాణాకు పాల్పడుతున్న పాత్రదారులను అదుపులోకి తీసుకోవడం, తద్వారా ముఖ్య సూత్రదాలను అరెస్ట్ చేసి, గంజాయి రవాణా మూలాలను ఛేదించడం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుండి మహారాష్ట్రకు చేరవేసేందుకు కారులో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ది.6.8.18న పటమట పోలీసులు వలపన్ని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.3.50 లక్షల విలువైన 157 కిలోల గంజాయిని మరియు రవాణాకు ఉపయోగించిన మారుతీ సుజికీ కారు, రెండు మొబైల్ ఫోన్‌లు, రూ.3 వేల నగదును, వాహనానికి సంబంధించిన ఇతర ధృవపత్రాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

<u>అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు :</u>

1) మహారాష్ట్రకు అహ్మద్‌నగర్ జిల్లా, చందా గ్రామానికి చెందిన బల్కె దిగంబర్ వసంత్ (25)
2) మహారాష్ట్రకు అహ్మద్‌నగర్ జిల్లా, చందా గ్రామానికి చెందిన చంద్రకాంత్ దిగంబర్ ఇంగ్లే (30)

గంజాయి అక్రమ రవాణాపై పక్కా సమాచారం మేరకు సెంట్రల్ జోన్ ఏసిపి శ్రీ సత్యానందం పర్యవేక్షణలో పటమట ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రామవరప్పాడు వద్ద శుభం కళ్యాణమండపం వద్ద పోలీసులు నిఘా ఏర్పాటు చేసి, గన్నవరం వైపు నుండి వస్తున్న మారుతీ సుజికీ కారు (నెం.ఏపి 31 జెజడ్ 522)ను ఆపడం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. అనంతరం కారును తనఖీ చేసి, ప్యాకింగ్ చేసిన 157 కిలోల గంజాయిని మరియు రవాణాకు ఉపయోగించిన మారుతీ సుజికీ కారును స్వాధీనం చేసుకోవడం జరిగింది.

గంజాయి రవాణాకు ఉపయోగించిన మారుతీ సుజికీ కారు అసలు రిజిస్ట్రేషన్ నెంబరు ఎమ్.హెచ్.12 జెజడ్ 522 కాగా ఆ కారుకు ఏపి 31 జెజడ్ 522 నకిలీ నెంబర్ ప్లేట్ తగిలించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయిని ఎగుమతి చేసుకుని మహారాష్ట్రకు చేరవేసేందుకు ప్రయత్నించి మార్గ మధ్య విజయవాడలో పట్టుబడటం జరిగింది. ఈ కేసులో గంజాయిని విక్రయించిన వ్యక్తిని మరియు కొనుగోలు చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది.

--xx--